# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 6

సోమవారం, ఆగస్టు 5, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

### తిహాడ్‌లో ఆమెతో కేటీఆర్, హరీశ్‌రావు ములాఖత్ కూడా నేడే



న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది. ఆమెను మార్చి 15న తొలుత ఈడీ, అనంతరం ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై 22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారాని(ఆగస్టు 5)కి వాయిదా వేశారు.



## ఏఐ సిటీలో 8 హబ్‌లు

**ముచ్చర్లలో 15 వేల ఎకరాల్లో భావి నగరం**

**ఓఆర్ఆర్ వెంట 30 వేల ఎకరాల పూలింగ్**

**ఉప్పల్ భగాయత్ తరహా విధానం అమలు**

**రూ.5600 కోట్లతో మూసీ ప్రక్షాళన**

**ఆర్ఆర్ఆర్ వరకూ హెచ్ఎండీఏ పరిధి**

**మునిసిపల్ ముఖ్య కార్యదర్శి దానకిశోర్**

హైదరాబాద్, ఆగస్టు 4: రాజధాని అంటే ఒకప్పుడు జంట నగరాలే! ఆ తర్వాత ఐటీ బూమ్‌తో సైబరాబాద్ రూపంలో మూడో మహానగరం ఆవిష్కృతమైంది!! ఈ మూడింటికీ తోడుగా.. ముచ్చర్లలో అభివృద్ధి చెందే నాలుగో మహానగరం కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో ఫ్యూచర్ సిటీగా అత్యద్భుతంగా ఉండబోతోందని మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తెలిపారు. హైటెక్స్‌లో ఆదివారం జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ల నుంచి వచ్చే విజ్ఞప్తులను ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

జీడీపీలో అధిక శాతం ఉన్న ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్ వచ్చి ఆర్థిక వ్యవస్థను ఏవిధంగా పరుగులు పెట్టించిందో.. ఏఐ కూడా ముచ్చర్లలో రాబోయే సిటీలో గణనీయమైన మార్పులు తీసుకొస్తుందని దానకిశోర్ తెలిపారు. ఏఐ సిటీని 15వేల ఎకరాల్లో నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని.. అది సైన్స్ సిటీ, స్పోర్ట్స్ సిటీ, హెల్త్ హబ్, ఎడ్యుకేషన్ హబ్ ఇలా ఎనిమిది రకాల సిటీల సమాహారంగా ఉండబోతోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ కంపెనీల విద్యుత్ వినియోగం భారీగా ఉంటోందని.. ఏఐ సిటీలో విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉండేలా ప్రణాళికలుంటాయని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్, లండన్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించి హైదరాబాద్ అభివృద్ధికి అనువైన ప్రణాళికలను అన్వేషించిందని, యూఎస్ పర్యటన ద్వారా

- మిగతా 2వ పేజీలో

## మళ్లీ భగ్గుమన్న బంగ్లాదేశ్..
## 72 మంది మృతి

ఢాకా: రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాలతో పొరుగు దేశం బంగ్లాదేశ్ మరోసారి భగ్గుమంది. దేశ వ్యాప్తంగా హింసాత్మక ఘటనలతో వణికిపోయింది. అధికార పార్టీ మద్దతుదారులు, ఆందోళనకారులకు మధ్య ఆదివారం చోటుచేసుకున్న ఘర్షణల్లో 72 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 14 మంది భద్రతా సిబ్బంది ఉండగా.. సిరాజ్‌గంజ్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌పై జరిపిన దాడిలోనే 13 మంది పోలీసులు మృతిచెందారు. వందలాది మంది తీవ్ర గాయాలపాలైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కేవలం రాజధాని ఢాకాలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

**నిరవధిక కర్ఫ్యూ..**

మరోసారి ఘర్షణలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి నిరవధిక కర్ఫ్యూ విధించింది. ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా వేదికలపైనా ఆంక్షలు విధించింది. 4జీ సేవలు నిలిపివేయాలని టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. మరోవైపు



2లో

## పెట్టుబడుల సాధన చర్చలపై ఆసక్తిగా ఉన్నా

### సీఎం రేవంత్‌రెడ్డి.. అమెరికా పర్యటన ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులు తీసుకురావడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ప్రారంభమైంది. ఆదివారం అమెరికా చేరుకున్న రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారుల బృందానికి న్యూయార్క్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు, పలువురు పారిశ్రామికవేత్తలు సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ "కీలకమైన న్యూయార్క్ నగరం నుంచే పెట్టుబడుల సాధన పర్యటన ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నాను. ఇక్కడి మన తెలుగు సోదర సోదరీమణులు గుండెల నిండా ప్రేమ, ఆప్యాయతలతో మాకు స్వాగతం పలకడానికి విచ్చేశారు. పెట్టుబడుల సాధన కోసం చర్చలను ప్రారంభించడానికి ఆసక్తిగా ఉన్నాను. తెలంగాణను మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవడం మనందరినీ ఏకం చేసే ఒక కల. ఆ కలను సాకారం చేసుకునే దిశగా ఈ పర్యటన సఫలీకృతమవుతుందని ఆశిస్తున్నాను" అని తన సందేశంలో పేర్కొన్నారు. న్యూయార్క్ నుంచి మొదలైన ఈ పెట్టుబడుల సాధన



పర్యటనలో రాబోయే 10 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలోని వివిధ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చలు జరగనున్నాయి. సీఎం నాయకత్వంలోని బృందంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులు భాగమవుతారు.

## షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో
## ఖాకీల కర్కశత్వం

**విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు**

**సమగ్ర విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్**




హైదరాబాద్: బంగారం దొంగతనం చేశారనే ఆరోపణలతో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎస్సీ మహిళను దారుణంగా కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అమానుష చర్య సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. లాకప్ హింస ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని శంషాబాద్ డీసీపీ తెలిపారు.

వివరాల్లోకి వెళితే.. గత నెల 24న షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులు దొంగతనం చేశారని నాగేందర్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సునీత, భీమయ్యతో పాటు వారి 13 ఏళ్ల

- మిగతా 2వ పేజీలో



## నేడు సాగర్ గేట్లు ఓపెన్!

**576 అడుగులు దాటిన జలాశయ నీటిమట్టం**

**రెండు లక్షల క్యూసెక్కుల విడుదలకు ఏర్పాట్లు**

**ఎగువ నుంచి 4.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**ఆల్మట్టికి 3.10 లక్షలు, శ్రీశైలానికి 4 లక్షలు.. మేడిగడ్డకు 4.87 లక్షల క్యూసెక్కుల వరద**

ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న కృష్ణమ్మ నాగార్జునసాగర్ జలాశయానికి వడివడిగా చేరుతోంది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సాగర్ నిండు కుండలా మారింది. జలాశయంలో నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరువ కావడంతో సోమవారం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు 6 గేట్లను ఎత్తి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు సీఈ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో.. పూర్తి సామర్థ్యం 215.60 టీఎంసీలకు.. నిల్వ 203.89 టీఎంసీలకు చేరింది.

దీంతో 10 గేట్లను ఎత్తి కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 4,27,711 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగుల (312.50 టీఎంసీలు)కు ఆదివారం సాయంత్రానికి 576.10 అడుగులు (271.90టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,613క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 26,040 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు.. మొత్తం 37,873 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి 3,10,556 ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 2.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 2.50 లక్షల ఇన్‌ఫ్లో వస్తుండగా 25 గేట్లను ఎత్తి 2,22,850 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జూరాలకు 2.60 లక్షల ఇన్‌ఫ్లో వస్తుండగా 2,50,153 క్యూసెక్కులను శ్రీశైలానికి వదులుతున్నారు.

## 6 ఏళ్లలో 6 కి.మీ ఫ్లైఓవర్ పూర్తి చేయలేదంటే సిగ్గుచేటు

### మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: ఉప్పల్- నారపల్లి మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ పనులను ఆదివారం సాయంత్రం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, అధికారులతో కలిసి పరిశీలించారు. 2018లో ప్రారంభమైన ఎలివేటెడ్ కారిడార్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని, నిర్మాణ పనుల వల్ల రహదారి గుంతల మయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ

- మిగతా 2వ పేజీలో





## 11 నుంచి యాదాద్రిలో స్నాన సంకల్పం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ మీద ఉన్న విష్ణు పుష్కరిణి వద్ద భక్తుల కోసం స్నానసంకల్పాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. విష్ణు పుష్కరిణిలో స్నానమాచరించే దంపతులు లేదా ఇద్దరికి పురోహితులతో గోత్ర నామాల సంకల్పం నిర్వహించడంతో పాటు, ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్వామివారి లడ్డూ సదుపాయం కల్పిస్తామని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. స్నాన సంకల్పం టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. దీన్ని ఆగస్టు 11వ తేదీ స్వాతి నక్షత్రం రోజున ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొబ్బరికాయలు కొట్టే స్థలాన్ని కూడా ఆ రోజే ప్రారంభించనుండగా.. దానికి సంబంధించిన పనులను ఆలయ అధికారులతో కలిసి ఈవో ఆదివారం పరిశీలించారు.

## ముచ్చర్ల ఫోర్త్ సిటీ వెనుక భూకుంభకోణం

**బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కార్**

**ధరణి పేరు మారిస్తే అవినీతి ఆగుతుందా?: సంజయ్**



సరూర్‌నగర్, ఆగస్టు 4: రంగారెడ్డి జిల్లాలోని ముచ్చర్లలో నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీ వెనుక భారీ భూకుంభకోణం దాగి ఉందని, వేలాది ఎకరాలను దిగమింగి ఆస్తులను కూడబెట్టుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం నగర శివారు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న సంజయ్ విలేకరులతో మాట్లాడారు.

ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 20 లక్షల ఎకరాల భూములను దిగమింగిందని, ఇప్పుడు ధరణి పేరును భూమాతగా మార్చి, మిగిలిన భూములనూ మేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పన్నాగం పన్నుతున్నదని ఆరోపించారు. ధరణి పేరు మారిస్తే అవినీతి ఆగుతుందా అని ప్రశ్నించారు. ధరణి అక్రమాలపై వేసిన కమిటీ

- మిగతా 2వ పేజీలో



# మళ్లీ భగ్గుమన్న బంగ్లాదేశ్.. 72 మంది మృతి

- మొదటిపేజీ తరువాయి

నిరసనల పేరుతో విధ్వంసానికి పాల్పడే వారు విద్యార్థులు కాదు.. ఉగ్రవాదులని ప్రధానమంత్రి షేక్ హసీనా పేర్కొన్నారు. అటువంటి వారిని అణచివేయాలని పౌరులకు పిలుపునిచ్చారు.

### ప్రధాని హసీనా రాజీనామాకు డిమాండ్

రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం సందర్భంగా చోటుచేసుకున్న గొడవల్లో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాయి. చర్చలకు రావాలని ప్రధానమంత్రి షేక్ హసీనా పిలుపు ఇచ్చినప్పటికీ.. ఆందోళనకారులు వాటిని తోసిపుచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం నుంచి శాసనోల్లంఘన ఉద్యమానికి పిలుపునిచ్చిన నిరసనకారులు.. పోలీసులు, ప్రభుత్వాధికారులు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. అంతేకాకుండా ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండు చేశారు.

### భారత్ అప్రమత్తం..

బంగ్లాదేశ్‌లో తాజా పరిణామాలతో అక్కడున్న మన పౌరుల్ని భారత్ అప్రమత్తం చేసింది. ఈ మేరకు రాయబార కార్యాలయం అడ్వైజరీని విడుదల చేసింది. ఆ దేశంలో ఉన్న విద్యార్థులు సహా భారతీయ పౌరులు తమతో టచ్‌లో ఉండాలని సిల్హట్‌లోని అసిస్టెంట్ హైకమిషన్ ఆఫ్ ఇండియా సూచించింది. ఇందుకు సంబంధించి స్థానిక కార్యాలయ ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచింది.



# షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఖాకీల కర్కశత్వం

- మొదటిపేజీ తరువాయి

కుమారుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం భర్తను వదిలేసిన డిటెక్టివ్ సీఐ రామిరెడ్డి, అతని సిబ్బంది బాధితురాలు సునీతను కుమారుడి ముందే విచక్షణా రహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. దొంగతనం చేసినట్టు ఒప్పుకోవాలని సీఐ తీవ్రంగా కొట్టడంతో స్పృహ కోల్పోయానని, ఆ తర్వాత ఇంటికి పంపించారని బాధితురాలు వాపోయింది. 24 తులాల బంగారం, రూ.2 లక్షల నగదుకు గానూ కేవలం ఒక తులం బంగారం, రూ.4వేల నగదు రికవరీ చేశామని పోలీసులు చెబుతున్నారు. మహిళపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పది రోజులు గడుస్తున్నా రిమాండ్ చెయ్యకుండా ఇంటికి పంపించడం వెనుక పోలీసులు కొట్టిన దెబ్బలకు మహిళ గాయపడటమే కారణంగా తెలుస్తోంది. పోలీసుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు.

### సీఐ రామిరెడ్డిపై బదిలీ వేటు

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో దళిత మహిళపై దాడి ఘటనకు సంబంధించి సీఐ రామిరెడ్డిపై బదిలీ వేటు పడింది. సీఐని సైబరాబాద్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. సీఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నామని, విచారణ నివేదిక అధారంగా తదుపరి చర్యలు తీసుంటామని సీపీ వెల్లడించారు.

### ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్

షాద్‌నగర్‌లో బంగారం దొంగతనం చేశారనే ఆరోపణలతో ఎస్సీ మహిళను పోలీసులు దారుణంగా కొట్టిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం దృష్టికి ఈ ఘటన వెళ్లడంతో వెంటనే ఆయన పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సమగ్ర విచారణ జరిపించాలని వారిని ఆదేశించారు. ఈ ఘటనతో సంబంధం ఉందని భావించిన వారిని వెంటనే సదరు పోస్టు నుంచి తప్పించి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేయాలన్నారు. ఘటనకు బాధ్యులైన వారు ఎవరూ తప్పించుకోలేరని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఘటనలో బాధితులకు న్యాయం చేయడంతో పాటు వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ఏఐ సిటీలో 8 హబ్‌లు

- మొదటిపేజీ తరువాయి

మరిన్ని చర్యలు చేపట్టనుందని తెలిపారు.

### 29 ప్రాంతాల్లో...

భూసమీకరణ విధానానికి సంబంధించి ఉప్పల్‌భగాయత్ ఒక చిన్న ప్రయోగమని.. మున్ముందు చూడబోయే భారీ ప్రయోగం 30 వేల ఎకరాలతో ఉంటుందని దానకిశోర్ తెలిపారు. అందులో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు వెంట 29 ప్రాంతాల్లో భూమిని ఇప్పటికే గుర్తించామని ఆయన వెల్లడించారు. అలాగే.. హెచ్‌ఎండీఏ పరిధిలో 61 ఇండస్ట్రియల్ పార్కులున్నాయని, వాటన్నింటిని కలుపుతూ రేడియల్ రోడ్లను తీసుకురావాలని సీఎం నిర్ణయించారని తెలిపారు. ఇంతకుముందు ఔటర్ పరిధిలో 35 రేడియల్ రోడ్లు ప్లాన్ చేయగా, అందులో 20 పూర్తయ్యాయని.. మరో నాలుగు రోడ్ల పనులు సాగుతున్నాయని చెప్పారు. వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ ఔటర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకూ 51 అదనపు రోడ్లకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే ఉన్న 27 రోడ్లను 100 అడుగుల నుంచి 200 అడుగుల మేర వెడల్పు చేయాల్సి ఉందని తెలిపారు.

# 6 ఏళ్లలో 6 కి.మీ ఫ్లైఓవర్ పూర్తి చేయలేదంటే సిగ్గుచేటు

- మొదటిపేజీ తరువాయి

అధికారుల తీరుపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆరేళ్లలో 6 కిలోమీటర్ల పై వంతెన పూర్తి చేయలేదంటే సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. నారపల్లి నుంచి ఉప్పల్ వరకు రహదారి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో చెప్పాలని అధికారులను ఆదేశించారు.

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడిచేది ప్రజలు కట్టే పన్నుతో. వంతెన నిర్మాణంలో ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ చర్చలో పాల్గొనేందుకు మీరు అర్హులు కారు. త్వరిత గతిన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి మీ దగ్గర ఉన్న ప్రణాళిక ఏంటి? గుత్తేదారుపై పూర్తి నెపం నెట్టడం కాదు.. మీరు చేయాల్సిన పనిని సక్రమంగా చేయలేక పోయారు. జీహెచ్‌ఎంసీ, ఫారెస్ట్, కాంట్రాక్టర్ అంటూ సాకులు చెప్పొద్దు" అని మండి పడ్డారు. ఈనెల 8వ తేదీ నుంచి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభిస్తామని నేషనల్ హైవే ఆర్వో తెలిపారు. సెప్టెంబరు చివరి కల్లా ఎలివేటెడ్ కారిడార్ టెండర్ పనులు పూర్తి చేయాలని, పనులు ప్రారంభించిన రెండున్నరేళ్లలోగా ఫ్లైఓవర్ పనులు పూర్తి కావాలని మంత్రి ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎక్కువ సమయం ఫ్లైఓవర్ పనులకే కేటాయించాలని సూచించారు.



### నవంబర్‌లో అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు ప్రారంభిస్తాం..

పదేళ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పారు. ఆరేళ్లలో 6 కి.మీ కారిడార్ పూర్తి చేయలేకపోవడం తెలంగాణకు అవమానకరం. ఈ విషయంలో కేటీఆర్ సిగ్గుపడాలి. హైదరాబాద్–విజయవాడ హైవేతో పాటు ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై దృష్టి పెట్టాలని కేంద్రమంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశాం. ఈ కారిడార్ అంశంపై గతంలో ఎంపీగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో పదిసార్లు ప్రశ్నించారు. ఆదివారం అయినా సరే అధికారులందరూ వచ్చి ఈ కారిడార్ అంశంపై రోడ్ మ్యాప్ ఇవ్వాలని కోరా. పది రోజుల్లో ఉప్పల్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డుకు కలిసే వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తాం. నవంబరు మొదటి మాసంలో ఫ్లైఓవర్ పనులు మొదలుపెట్టి 18- 20 నెలల్లో పూర్తి చేస్తాం. డిసెంబరులో మూసీ పనులు మొదలుపెడతాం. గత ప్రభుత్వం చేసిన అప్పులకు రూ.7వేల కోట్లు వడ్డీ కడుతున్నాం. సబితా ఇంద్రారెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లు మంత్రి పదవి ఇస్తే.. ఆ తర్వాత మంత్రి పదవి కోసం పార్టీ మారారు. సభలో మహిళలు కంటతడి పెట్టలేదు, నవ్వుకున్నారు. కేసీఆర్ ప్రతిపక్ష హోదాలో ఉంటే ఉండాలి లేదా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. నవంబర్‌లో అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ కట్టింది కాబట్టే ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయి" అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

# రేషన్‌కు, సంక్షేమ పథకాలకు వేర్వేరు కార్డులు

### త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 4: చౌక దుకాణాల్లో రేషన్ తీసుకునేందుకు, సంక్షేమ పథకాలను పొందేందుకు వేర్వేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సచివాలయంలో ఆదివారం ప్రజావాణి ఫిర్యాదులపై జరిగిన సమీక్ష సందర్భంగా.. ప్రజావాణికి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పందిస్తూ రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాగే కొత్త పెన్షన్లనూ త్వరలో మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్క్‌లను బలోపేతం చేసేలా చర్యలు చేపడితే సీఎంఆర్‌ఎఫకు సంబంధించి ఫిర్యాదులు తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు. ప్రజావాణి విభాగంలో పని చేసేందుకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలని అధికారులు కోరగా.. తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎంచెప్పారు. ప్రజావాణి పనితీరుపై మూడు నెలకోసారి సమీక్ష నిర్వహిస్తానన్నారు.

### మార్చి కల్లా యాదాద్రిలో విద్యుదుత్పత్తి

వచ్చే మార్చికల్లా ఎట్టి పరిస్థితుల్లో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరిగి తీరాల్సిందేనని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్




పనుల పురోగతిపై సచివాలయంలో జెన్‌కో అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. యాదాద్రి నాలుగు యూనిట్లనూ దశల వారీగా వచ్చే మార్చి కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు.. అందుబాటులో ఉన్న స్థలాల్లో 20 సమీకృత గురుకుల సముదాయాలను నిర్మించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆయన విద్యాశాఖ, ఆర్‌అండ్‌బీ, ప్రైవేటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో గురుకులాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. తొలిదశ నిర్మాణా లు వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తికావాలన్నారు.

# ముచ్చర్ల ఫోర్త్ సిటీ వెనుక భూకుంభకోణం

- మొదటిపేజీ తరువాయి

నివేదికపై శ్వేతపత్రం విడుద చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్ చుట్టుపక్కల గల విలువైన భూములను కాజేయడానికే ప్రభుత్వం ఫోర్త్ సిటీని తెరపైకి తెచ్చిందని, దానికోసం భూసేకరణ బాధ్యతను కాంగ్రెసలోని ఓ నాయకుడికి అప్పగించిందని ఆరోపించారు. ఈ సిటీ వల్ల స్థానిక రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల పండుగలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ.. హిందువుల పండుగలకు మాత్రం అత్తెసరు నిధులు ఇచ్చి చేతులు దులుపుకుంటోందని మండిపడ్డారు. హైదరాబాద్ శివారులోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదనను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. విలీనం ప్రతిపాదనకు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ రూపొందించి ఉద్యమం చేపడతామని సంజయ్ తెలిపారు.



# కారం మెతుకులతో కడుపు నింపుకోవాలా?

### సర్కారీ బడి పిల్లల గతి ఇంతేనా?

### బిల్లుల పెండింగ్ వల్లే దుస్థితి: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 4: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కారం మెతుకులతో కడుపు నింపుకోవాల్సిందేనా.. మధ్యాహ్న భోజనంలో ఏం పెడుతున్నారు.. పిల్లలకు అందించే మెనూపై ప్రభుత్వం స్పందించాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం తిని కడుపు నింపుకొన్నారని ఓ ఫొటోను ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారం కోసం అందించే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం, ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలోనూ విఫలమైందన్నారు. భోజన సామగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండడంవల్ల విద్యార్థులకు సరైన భోజనం అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని హరీశ్ రావు కోరారు.

# తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదే..

### పార్టీ జాతీయ నేత బీఎల్ సంతోష్

### కాంగ్రెసలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసలపై ఆరా

హైదరాబాద్, ఆగస్టు 4: తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదే అని పార్టీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను సీరియ్‌సగా తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలపై స్థానిక నాయకత్వం తక్షణం స్పందించాలని పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన సంతోష్.. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఏర్పాటు చేసిన రైతు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై సంతోష్ ఆరా తీశారు. ముఖ్యంగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలో చేరిన పది మంది ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్లారు..? కాంగ్రెస్ ఆకర్ష్ ప్రభావం ఎలా ఉంది..? కాంగ్రెస్ పాలన, వాగ్దానాల అమలుపై ప్రజలు ఏమనుకుంటున్నారు..? బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి..? తదితర అంశాలపై ఆయన ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావాలని ఆయన ప్రధాన కార్యదర్శులకు సూచించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత తొలిసారిగా రాష్ట్రానికి వచ్చిన సంతోష్, పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ పటిష్ఠతపై దిశానిర్దేశం చేశారు.



### రేపు పదాధికారుల సమావేశం

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరగనుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రుణమాఫీ, నిరుద్యోగుల సమస్యలపై ప్రధానంగా చర్చించనున్నారని పార్టీ నేతలు తెలిపారు. ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై సమీక్షించనున్నారు.

# అమెరికా వెళ్లిన సీఎం బృందానికి శుభాకాంక్షలు

### రాజకీయాలకన్నా తెలంగాణకే మా ప్రాధాన్యం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 4: రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు అమెరికాతోపాటు దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ ప్రతినిధుల బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో వారు విజయం సాధించాలని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఆకాంక్షించారు. గడిచిన పదేళ్లలో తమ ప్రభుత్వం ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురాగలిగిందని, తద్వారా రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తేవడంతోపాటు 24 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించగలిగామన్నారు.

ముఖ్యమంత్రి ప్రతినిధి బృందం ఇలాంటి కంపెనీలతో చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి, తమకు రాజకీయాలకన్నా.. తెలంగాణకే ప్రథమ ప్రాధాన్యమని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో బలగం సినిమా ఉత్తమచిత్రంగా, దర్శకుడు వేణు యెల్దండి ఉత్తమ దర్శకునిగా ఎంపిక కావడంపట్ల కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు ఆ చిత్ర బృందానికి ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వేణు చేసిన కృషిని ప్రశంసిస్తూ.. ఇది మీ కష్టానికి దక్కిన ప్రతిఫలమని పేర్కొన్నారు.



# అడ్వకేట్స్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో న్యాయవాదుల ఏడు లక్షల ఆరోగ్యం భీమా సౌకర్యానికి ఏకగ్రీవ తీర్మానం




హైదరాబాద్, ఆగష్టు 4(వాయిస్ టుడే) జంట నగరాల్లోని న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం 25వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో అధ్యక్షతన జరిగింది. సందర్భంగా న్యాయవాదులకు రూ.7 లక్షల ఇన్సూరెన్స్, 2.5 లక్షల మెడిక్లైన్, అంతక్రియల కోసం రూ.50 వేలు మంజూరు చేయాలని సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. కార్యదర్శి పోలిశెట్టి రవి సమర్పించిన నివేదికలో న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్న అడ్వకేట్ సొసైటీకి వ్యవస్థాపక, పూర్వ, ప్రస్తుత డైరెక్టర్ల సేవలు మరువలేమని కొనియాడారు. అడ్వకేట్ సొసైటీ ఆధ్వర్యంలో తక్కువ వడ్డీతో న్యాయవాదులకు బంగారు నగలపై రుణాలను అందజేస్తున్నదని, అలాగే విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన అడ్వకేట్ సొసైటీ సభ్యుల పిల్లలకు ఏటా ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్నదని పేర్కొన్నారు. సివిల్ కోర్టు నాంపల్లి క్రిమినల్ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు మరియు రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో డిస్పెన్సరీలను ఏర్పాటు చేసి న్యాయవాదులకు, కక్షిదారులకు పోలీసులకు కోర్టు సిబ్బందికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడ్వకేట్ సొసైటీ డైరెక్టర్లు ఆకుల మాణిక్ ప్రభు, ఎ. మహేశ్వర్, శ్రీధర్, మణికొండ ప్రవీణ్, పి. శ్రీనాథ్, రాజీవ్ రెడ్డి, మాజీ డైరెక్టర్లు మర్రి దుష్యంత్ రెడ్డి, గోపిరెడ్డి రామ్ రెడ్డి, బూర శంకర్, ప్రమోద్ కుమార్ కేడియా, సునీల్, కొండూరు వినోద్ కుమార్, జలకం కిషోర్, అబ్దుల్ ఖాదీర్, జె. కే. రంజిత్, కాసుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కొండ కుటుంబాలకు భరోసా

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, ఆగష్టు 4(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 4 లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1,25, లు ఆర్థిక సహాయానికి చెక్కులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబాలకి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే గాంధీ పునరుద్గాటించారు .అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధినిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. వైద్య చికిత్సకు సహకారం అందించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయి నేనీ చంద్రకాంత్, కాశినాథ్ యాదవ్, మంత్రి ప్రగడ సత్యనారాయణ, చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి,చిన్నోళ్ల శ్రీనివాస్, మంజుల, రాధ బాయి మరియు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలందరికు బోనాల పండుగ శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి, ఆగష్టు 4(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకునే శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ ఆషాడమాసం బోనాల పండుగ ఆఖరి ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని దిన బంధు కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, డివిజన్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మూసా పేటలో ఘనంగా ఆఖరి ఆషాడమాస బోనాలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



కూకట్‌పల్లి, ఆగష్టు 4(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు ఆఖరి రోజైన ఆదివారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. మూసాపేట డివిజన్ పరిధిలోని జనతా నగర్ మైసమ్మ ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా నిర్వాహకులకు పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కుల వెంకటేశ్వరరావు, గడ్డం శీను, ఆర్ సాయిలు, పి నరసింహ, పి సత్యనారాయణ, చిత్తారి ఎల్లయ్య, ఎం నరసింహ పాల్గొన్నారు.



## ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కట్టా మైసమ్మ తల్లికి బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి, ఆగష్టు 4(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని కట్ట మైసమ్మ ఆలయంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు కట్ట మైసమ్మ ఆలయంలో జరుగుతున్న రుద్రచండి హోమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శంకర రెడ్డి ఆహ్వానం మేరకు ఆషాడ మాసం చివరి ఆదివారం రోజు కట్టమైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న రుద్ర చండీ హోమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి రాజేశ్వరరావును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## 186 కుల సంఘాలతో దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణం

### దర్శకులు మహాలంక సేనాపతి

సికింద్రాబాద్, ఆగస్టు 04 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రైతాంగా సాయుధ పోరాటం కోసం దొడ్డి కొమురయ్య అనేక పోరాటాలు చేశారని చిత్ర దర్శకులు మహాలంక సేనాపతి అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సినిమా నిర్మాణానికి సహకరిస్తున్న సబ్బండ వర్గాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సినిమా చిత్ర దర్శకులు మహాలంక సేనాపతి మాట్లాడుతూ భూమి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ స్వతంత్రం కోసం దొడ్డి కొమురయ్య పోరాడారని తెలిపారు. ఆయన చరిత్ర మరుగున పడిపోకుండా భవిష్యత్తు తరాలకు గుర్తుండే విధంగా దొడ్డి కొమురయ్య పేరుతో సినిమా నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. దీనికి 186 కుల సంఘాల మద్దతు తెలిపి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో భూంపల్లి అశోక్, దాసు రామ్ నాయక్, కోలా శ్రీనివాస్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బండ మైసమ్మ బోనాలు

జూబ్లీహిల్స్ ఆగస్టు 4 (వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ ఎస్పి అర్ హిల్స్ గ్రౌండ్లోని బండ మైసమ్మ బోనాలు చాలా ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమం కాంగ్రెస్ సీనియర్ లీడర్ శేఖర్ అద్వారంలో నిర్వహించారు ముఖ్య అతిథులుగా పాల్గొన్న రహమత్ నగర్ కార్పొరేటర్ సీ ఎన్ REDDY కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## 7న అఖిలభారత జాతీయ ఓబీసీ మహాసభ

### బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

సికింద్రాబాద్, ఆగస్టు 04 (వాయిస్ టుడే ప్రతినిధి): పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్ లో ఈనెల 7న అఖిలభారత జాతీయ ఓబీసీ 9వ మహాసభ నిర్వహిస్తున్నామని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం అల్వాల్ లోని జయశంకర్ విగ్రహ ఆవరణలో మహా సభ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం కుందారం గణేష్ చారి మాట్లాడుతూ 70 కోట్ల పైగా ఉన్న బీసీలను అన్ని రంగాల్లో వెనుక పడేశారని, పారిశ్రామిక శ్రామికంగా ఆర్థికంగా రాజకీయంగా విద్య పరంగా అన్ని రంగాల్లో వెనకబడి పోవడానికి కారణం పాలకులే అని విమర్శించారు. బీసీలకు గొర్రెలు బర్రెలు రేషన్ కార్డు ఆధార్ కార్డు చిన్నచిన్న స్కీములు ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎంపీలు ప్రతిసారి డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయ వ్యవస్థను తమ అస్తగతం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలు మేలుకొని మన హక్కులను కాపాడుకోవాలని ఆగస్టు 7న అమృత్ సర్ లో జరిగే మహాసభకు తెలంగాణ రాష్ట్రం నుండి బీసీలు ఓబీసీలు, పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విక్రమ్ గౌడ్, శ్యామ్, నిరంజన్, నరసింహులు, వెంకట్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో పోచమ్మ తల్లిని దర్శించుకున్న రజితపరమేశ్వర్ రెడ్డి దంపతులు



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ కార్పొరేటర్ మందుముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి దంపతులు బోనాలను పురస్కరించుకొని పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పల్ నల్ల చెరువు సమీపంలోని పోచమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాలలో ఆలయ కమిటీ ప్రతి నిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.ఇప్పటికే రజితపరమేశ్వర్ రెడ్డి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లను చేయించిన విషయం తెలిసిందే. సంబంధిత జిహెచ్ఎంసి, పోలీసు అధికారులు భక్తులకు ఇబ్బంది కాకుండా చూడాలని కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు.

## ఎస్సై తుల్జారమ్ పుట్టిన రోజు సంబరాలు

జూబ్లీహిల్స్ ఆగస్టు 4 (వాయిస్ టుడే) బోరబండ పోలీస్ స్టేషన్ లోని ఆదివారం రోజున తుల్జారమ్ ఎస్సై పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించిన బోరబండ ఇన్స్పెక్టర్ శేఖర్ ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ భోపాల్ గౌడ్ ఎస్సై నాగుల్ మీరా పోలీసులు పాల్గొన్నారు.



# యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు అందర్నీ రెగ్యులరైజ్ చేయాలి

### తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్ జెఏసి

సికింద్రాబాద్, ఆగస్టు 04 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులన్దర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్ జెఏసి చైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, వర్కింగ్ చైర్మన్ డాక్టర్ ఎం. రామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యు జి సి చైర్మన్ జగదీష్ కుమార్ ఇచ్చిన స్టేట్మెంట్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు యొక్క పనితీరుపై తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 13 యూనివర్సిటీలలో మొత్తం కాంట్రాక్ట్ అధ్యాపకులే తమ భుజస్కాంధాలపైన మోస్తూ ఉన్నారనీ, గత 25 సంవత్సరాల నుంచి విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న అనేకమంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు పేటెంట్లు ఉన్నవనీ, విశ్వవిద్యాలయాలకు నాక్ ఎం ప్లస్ గ్రేడ్ రావడంలో కూడా ప్రధాన భూమిక పోషిస్తూ ఉన్నారన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు పబ్లికేషన్స్ ఉన్నాయన్నారు, యు జి సి పిహెచ్డి గైడ్ షిప్ కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇవ్వకపోవడం వల్ల కొంత పరిశోధనలకు అవరోధం కలుగుతుందనీ పరిశోధనలకు అనేకమంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు.



తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో రెగ్యులర్ అధ్యాపకులు కేవలం 780 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2100 పైచిలుకు ఖాళీలలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు 1445 మంది మాత్రమే పని చేస్తున్నారని, సుమారు 67% వేకెన్సీస్లలో 1445 మంది కాంట్రాక్ట్ అద్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయటం మూలంగా మరో 700 పోస్టులను రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేసుకోవచ్చునీ, సెల్ ఫైనాన్స్ లో సుమారు 1000 పోస్టుల వరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయవచ్చునీ, సెల్ ఫైనాన్స్ కోర్సులు గత 25 సంవత్సరాల నుంచి కూడా విశ్వవిద్యాలయాలలో విజయవంతంగా నడుస్తున్నవన్నారు. ఈ 13 విశ్వవిద్యాలయాలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చినట్లయితే అదనంగా 1000 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లయితే విశ్వవిద్యాలయాలు సర్వతో ముఖాభివృద్ధి కావడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మూలంగా 1000 మంది అధ్యాపకుల సంబంధించి పోస్టులను మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనీ, ఆ విధంగా వెయ్యి పోస్టులు మరియు 700 పోస్టు ఖాళీగా ఉన్న మొత్తం కలిపి 1700 వరకు పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసుకోవచ్చన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు అందర్నీ రెగ్యులరైజ్ చేసినా రాష్ట్ర ప్రభుత్వము మరో 1700 పోస్టులను మంజూరు చేయించి భర్తీ చేస్తే తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సస్యశ్యామలంగా అవుతాయన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశారు కావున విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందర్నీ రెగ్యులరైజ్ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఉమాదేవి కేసు విషయంలో కూడా రెగ్యులరైజ్ చేయాలని చెప్పిందనీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందర్నీ వన్ టైం ఛాన్స్ ఇచ్చి రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ అల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జె ఏ సి గా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# రెండవ ఎడిషన్ మరథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్




కరీంనగర్ ఆగష్టు 04(వాయిస్ టుడే )కరీంనగర్ రన్నర్స్ , సైక్లిస్టుల సంఘం ,జిల్లా పరిపాలన సహకారంతో సెప్టెంబర్ 22న ఆదివారం రోజున అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రెండవ ఎడిషన్ మారథాన్ పోస్టర్ ను బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు , కేంద్ర హెూంశాఖ సహాయ మాత్యులు బండి సంజయ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కె ఆర్ సి ఎ ప్రెసిడెంట్ పసుల మహేష్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన ఒకటవ ఎడిషన్ గ్రాండ్ సక్సెస్ అయిందని, మారథాన్ 2 వ ఎడిషన్ ను మరింత సక్సెస్ చేయడానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా రన్ లో నాలుగు కేటగిరిలో 3 కె, 5 కె, 10 కె ఉంటాయన్నారు. ప్రోగ్రాంలో పాల్గొ నే వారు https:// knr 24.iq 301. Comని ఉపయోగించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ మారథాన్ లో పాల్గొనేవారు టి షర్ట్ ,పతకం, డిజిటల్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని, రన్ లో పాల్గొనే వారికివెళ్లేదారిలో వారికి అల్పాహారం, హైడ్రేషన్ పానీయాలు అందించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలు, మరింత సమాచారం కోసం చరవాణి నంబర్లు7759265758., 8143658008.,9676499949. సంప్రదించ వచ్చన్నారు. ఇట్టి కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శివ, అఖిల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల బెదిరింపులు బాధాకరం

### కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్ పల్లి : ఆగష్టు 4(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని గురువారం సాయంత్రం ఓ పిచ్చికుక్క పలు కాలనీలలో స్వైర విహారం చేస్తూ 24 మందిని కరచి గాయాలపాలు చేసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు బాధిత కుటుంబ కుటుంబాలను కనీసం పరామర్శించకపోవడం బాధాకరం. డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు బాధితులను పరామర్శించడంలో బాధ్యతను విస్మరించి సేవ చేసే వారిని బెదిరించడం అలవాటుగా చేసుకుని నిస్సిగ్గుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. బాలానగర్ స్థానిక కార్పొరేటర్ విషయం తెలుసుకుని స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం అందించి పిచ్చి కుక్కలను జీహెచ్ఎంసీ సిబ్బంది ద్వారా తరలించారు. అదేవిధంగా ప్రజలను అప్రమత్తం చేసి వ్యాక్సిన్లు వేయించడంలో అప్రమత్తం చేసిన సామాజిక కార్యకర్తలను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు కావాలనే దురుద్దేశంతో బెదిరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సైతం తన వంతు బాధ్యతగా బాలానగర్ లో పర్యటించి బాధితులను పరామర్శించి కుక్కలను నియంత్రించడానికి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రజలపై ప్రేమ ఉన్న వారు కుక్కల బారిన పడిన బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించాల్సిన వారు కుయుక్తులు రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నేతల విజ్ఞతకు తగదని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయగా ఆలేరు మండలం నుండి 52 మందికి ఆలేరు పట్టణం నుండి 33 ఆత్మకూరు మండలం నుండి 51 మోటకొండూరు 49 గుండాల మండలం నుండి 63 మొత్తం 240 మంది చెక్కులను పంపిణీ చేశారు.



## శ్యామ్ సుందర్ మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్ ఆగష్టు 04(వాయిస్ టుడే )సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది బాణాల శ్యామ్ సుందర్ ఆదివారం రోజున గుండెపోటుతో హుజురాబాద్ లోని తన నివాసంలో అకాల మరణం చెందడం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హుజరాబాద్ లో శ్యాంసుందర్ పార్థివదేహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ సుందర్ అకాల మరణం సమాజానికి తీరని లోటన్నారు. శ్యాంసుందర్ వివిధ పత్రికలలో పనిచేసి , అడ్వకేటుగా కూడా రాణించారని , నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం పరితపించే ఆయన మన మధ్యలో లేకపోవడం విచారకరమన్నారు. శ్యాంసుందర్ కుటుంబానికి బిజెపి జిల్లా శాఖ పక్షాన ప్రగాఢ సానుభూతిని , సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు చెప్పారు.కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తో పాటు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొమురయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు, ఎస్సి మోర్చా పట్టణ అధ్యక్షులు బోరగాల సారయ్య, సుదగోని శ్రీనివాస్ గౌడ్, కొలిపాక వెంకటేష్ ,ఛత్తర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ సుందర్ మరణం తీరని లోటు: టియుడబ్ల్యూజే

హుజూరాబాద్ ఆగస్టు 4 (వాయిస్ టుడే): సీనియర్ జర్నలిస్టు బాణాల శ్యామ్ సుందర్ ఆదివారం రోజున ఉదయం గుండెపోటుతో హుజురాబాద్‌లోని తన నివాసంలో అకాల మరణం పొందారు. ఆయన మరణం జర్నలిస్టు రంగానికి తీరని లోటని టీయూడబ్ల్యూజే కరీంనగర్ జిల్లా కన్వీనర్ నగునూరి శేఖర్ అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్యాంసుందర్ కరీంనగర్ జిల్లా యూనియన్‌లో దాడుల నివారణ కమిటీ కన్వీనంగా పనిచేశారు. మూడు దశాబ్దాలుగా జర్నలిస్టు వృత్తిలో ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, సూర్య దిన పత్రికలలో పనిచేస్తూ హుజురాబాద్‌లో న్యాయవాదిగా కొనసాగారు. యూనియన్ పక్షాన తక్షణ సహాయంగా పదివేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ప్రెస్ క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యన్ శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు కోరం సుధాకర్ రెడ్డి మామిడి రవీందర్ కాయిత రాములు సునీల్ కుమార్ పోతరాజు సంపత్ వర్కింగ్ కూడికల సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు : ఎస్సై పృథ్వీధర్ గౌడ్

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 4: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని అలాగే మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ ఆటో డ్రైవర్లకు సూచించారు. ప్రమాదాల నివారించడానికి రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రం మండల లో ఆటో డ్రైవర్ లతో ఎస్సై పృథ్వీధర్ గౌడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు నిబంధనలకు అనుగుణంగా ప్రయాణికులను తీసుకెళ్లాలని తెలిపారు.ప్రతి ఆటోకు ఇన్సూరెన్స్ ఫిట్నెస్ డ్రైవర్ లైసెన్స్. సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఎస్ఐ వెంట హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య , బ్లూ కొట్ సిబ్బంది కోఠి,సాయిలు ఉన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్లో సీటు సాధించిన విద్యార్థినికి అభినందించిన మండల విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఆగస్టు 4: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపికైన మొగులొజీ లిఖితను మండల విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటలో నాలుగో తరగతి ప్రవేశానికి మండల కేంద్రానికి చెందిన మొగులోజి మానస గంగ చారి కూతురు లిఖిత ఎంపిక అయింది. 60 సీట్లు మాత్రమే ఉండే స్పోర్ట్స్ స్కూల్ లోఎంపిక కావడానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు పోడిపడ్డారు ఇందులో లిఖిత ప్రతిభ తో రాష్ట్రంలో 18 ర్యాంకు సాధించింది. దీంతో విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన ముద్దుబిడ్డ అయినా లిఖితను బోయినపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వగృహంలో లిఖితను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఉదారి నరసింహ చారి మాట్లాడుతూ లికిత స్పోర్ట్స్ స్కూల్లో సీట్ సాధించడం తమకు గర్వకారణంగా ఉందని తెలిపారు భవిష్యత్తులో మంచి స్థానం సంపాదించాలని కోరారుఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు వుదారి నరసింహ చారీ,మండల ప్రధాన కార్యదర్శి పాళోజు జగ దిశ్వర చారీ,కోశాధికారి బోగోజీ గంగాధర్ చారీ, మొగులో జి గంగచారీ, బొగోజీ భూమయ్య, మోగులో జి లక్ష్మి నారాయణ, మొగులొజి లక్ష్మి రాజం,అక్కపల్లి శంకరయ్య, ఊదారి రమేష్,బూరుగుపల్లి రమేష్, బోగోజి ప్రసాద్, బొగోజి శేకర్,మొగులొ జు లచ్చయ,సదానంద చారీ,సంగెం శ్రీను, కుంబోజ్ లక్ష్మణ్, నాగ సముద్రం లక్ష్మణ్ తది తరులు పాల్గొన్నారు.

## ఏమ్మెల్యే కే ఆర్ నాగరాజును కలసిన శ్రీ వినాయక కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



వరంగల్ ఆగష్టు 04 (వాయిస్ టుడే) ఖమ్మం రోడ్డు లోని నాయుడు పంపు శ్రీ వినాయక కాలనీ అభివృద్ధి సంఘం సభ్యులు వర్ధన్న పేట ఏమ్మెల్యే కే ఆర్ నాగరాజు ను ఆదివారం నాడు వారి స్వగృహం లో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా అయన కు పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ కాలనీ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు పైగా అవుతున్న అభివృద్ధి కీ నోచుకోలేదని గత పాలకులు తమ కాలనీ నీ పట్టించు కోలేదని కాలనీ లో పలు సమస్య లతో ఇబ్బందులు పడుతున్నమని ఏమ్మెల్యే కు తెలిపారు సమస్య పై స్పందించిన ఏమ్మెల్యే త్వరలో కాలనీ నీ సందర్శించి సమస్య లను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు సుభాష్ రావు, శివకుమార్, కుమారస్వామి, సోమేశ్వరరావు, సంపత్, రాజ్ కుమార్, కర్ణాకర్, ఏకంబరం, రవి, ప్రితం,సుధాకర్,శివ తదితరులు పాల్గొన్నారు. ఈరోజు గౌరవ ఎమ్మెల్యే గారు శ్రీ నాగరాజ్ సార్ గారిని మా కాలనీ సమస్యల గురించి తెలియపరిచి ఆహ్వానించినాము ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పోలుసాని సుభాష్ రావు మరియు కార్యవర్గ సభ్యులు కాలనీవాసులు.. రవి. ప్రీతం. శివ. రవీందర్. శివకుమార్. కుమారస్వామి. సోమేశ్వరరావు. సంపత్. రాజ్ కుమార్. కర్ణాకర్. ఏకాంబరం. బాల వేను. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇట్లు.కాలనీ అధ్యక్షులు పోలుసాని సుభాష్ రావు. శ్రీ వినాయక కాలనీ వెల్ఫేర్ సొసైటీ. నాయుడు పంప్. తది తరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా నిర్వహించుకున్న అంగన్వాడి వర్కర్స్



పెద్దపల్లి జిల్లా: ఆగస్టు .4 (వాయిస్ టుడే) గోదావరిఖని: ఫ్రెండ్‌షిప్ డే ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకుంటారు. ఈ రోజు ప్రత్యేకించి మన ప్రాణస్నేహితులతో మన బంధాన్ని గుర్తించుకోవడానికి, వారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి ఉద్దేశించింది. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేయ చేసుకుంటూ అంగన్వాడి టీచర్లు హెల్పర్లు ఘనంగా నిర్వహించుకున్నారు అందరూ కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు ఈ సందర్భంగా అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ..అందం,అధికారం,

డబ్బు, బలం, బలగం, ఏదో ఒకరోజు కోల్పోవాల్సిందే. వాటి గురించి ఆరాటపడుతూ విలువైన స్నేహాన్ని, మర్చిపోవద్దు.. తల్లిదండ్రులు జన్మనిస్తారు దేవుడు మంచి స్నేహితులను ఇస్తాడు అని అన్నారు. మిత్రులను కోల్పోకు.. స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రమ సబిత వెంకటరమణ తిరుమల భాగ్య మినహాజ్ వకుల షాహిని పుష్పలత తది తరులు పాల్గొన్నారు.

## సృష్టిలో స్నేహబంధం ఎంతో గొప్పది: తొర్రూరు సిఐ సంజీవ

తొర్రూరు, ఆగస్ట్ 4 వాయిస్ టుడే: సృష్టిలో స్నేహబంధం ఎంతో గొప్పదని ముఖ్యఅతిధులుగా విచ్చేసిన తొర్రూర్ సి ఐ సంజీవ, ఎస్సై కూచిపూడి జగదీశ్,ప్రముఖ వైద్యులు లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ కే రాజేందర్ రెడ్డి లు చెప్పారు. ఆదివారం పట్టణం లోని విశ్రాంతి భవనం లో తొర్రూర్ స్నేహ బృందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఒకరి ఒకరికు ఫ్రెండ్ షిప్ బాండ్ లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి మాట్లాడుతూ స్నేహం విలువ ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నప్పుడు ఆ స్నేహబంధం ఎంత విలువైనదో తెలుస్తుందని, నిస్వార్ధ బంధం ఒక్క స్నేహం అని చెప్పారు. మిత్ర బృందం గత 10ఏళ్ల కు పైగా అన్ని వర్గాల స్నేహితులతో నిర్వహించడం ఎంతో ప్రశంసనీయం అన్నారు. మానవ సంబందాలలో రక్త సంబంధం కన్నా స్నేహ బంధం గొప్పదని తారతమ్యలను చూపదని సమానత్వం ను లోకానికి చాటుతుందని, మానవ జీవిత చరమాంకం లో ఆదుకునేది స్నేహం మాత్రమే అన్నారు. చెడు స్నేహాలను చేయొద్దని యువత ను కోరారు.జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, స్నేహితుల దినోత్సవ కమిటీ కల్లూరి నాగేంద్ర చారి గోపారపునాగేశ్వరరావు,దామెర సరేష్ దేవరకొండ క్రిష్ణ ప్రసాద్, శ్రీరామ్ రాజమౌళి,రాగి శ్రీనివాస చారి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్,తోట శ్రీనివాస్ చిదిరాల శ్రీనివాస్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్ పెద్దగాని సోమ య్య యాకూబ్ రెడ్డి నాగేశ్వర రావు మీడియా మిత్రులు వజినపల్లి అనిల్,ఇమ్మడి రాంబాబు వినోద్ రెడ్డి,అశోక్ రెడ్డి,రాము,అమిర్ ఉపేందర్, శ్రీనివాస్, కందుకూరి రాజు సోమేశ్వర చారి,కృపాకర్ రాజు చిట్యాల వెంకన్న,అన్వర్ రామగిరి భాస్కర చారి, స్నేహితులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొన్న వాహనం.. ముగ్గురి మృతి

అమ్రాబాద్: వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మత్స్యబొల్లారంకు చెందిన మాచర్ల కిషన్ కన్నయ్య(22) తన ముగ్గురు స్నేహితులతో కలిసి శనివారం అర్ధరాత్రి కారులో శ్రీశైలం జలాశయం సందర్శనకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్ కన్నయ్యతో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కోంపల్లికి చెందిన సాయిప్రకాశ్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం నంద్యాల జిల్లా సున్నిపెంటకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఖిలా వరంగల్ ప్రాంతాన్ని ఎకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాం

**రాష్ట్ర దేవదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ.**

**రాష్ట్ర ముఖ్యమంత్రిచే సెప్టెంబర్ 9న మ్యూజియం ప్రారంభానికి చర్యలు**



వరంగల్ ఆగస్టు 04 (వాయిస్ టుడే) ఖిలా వరంగల్ ప్రాంతాన్ని ఎకో, టెంపుల్ టూరిజం గా అభివృద్ధి చేస్తామని.. అందుకు ప్రణాళికలు రచించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అధికారులను ఆదేశించారు. మంత్రి కొండ సురేఖ ఆదివారం గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్ తో కలసి ఖిలా వరంగల్లోని రాతి కోట ఉత్తర ద్వారం, ఏకాశీల క్రీడా మైదానం, అగర్త చెరువు మత్తడి, అగర్త చెరువు, లక్ష్మీ పత్రి గండి త్రికుటాలయాన్ని, పురావస్తు శాఖ మ్యూజియం, శంభుని గుడి ప్రాంతాలను పరిశీలించి ఏకో టూరిజం తో పాటు టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయుటకు సంబంధిత అధికారులు పలు సూచనలు చేశారు.

వరంగల్ రాతికోట ద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరును పరిశీలించి, నీరు నిలవడానికి కారణాలు అధికారులతో తెలుసుకొని నిల్వ ఉండకుండా సాంకేతికపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అగర్తల చెరువును పరిశీలించి చెరువు సుందరికరణ, బోటింగ్, ఫిషింగ్, లైటింగ్ తదితర ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని మంత్రి అన్నారు. ఖిలా వరంగల్ లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కమ్యూనిటీ ప్రజల సౌకర్యార్థం అదనంగా మొదటి అంతస్తు నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ ను మంత్రి సూచించారు.

పురాతన కట్టడాలు చెట్లు, పిచ్చి మొక్కలతో పేరుకుపోయి వాటి ఆకారం కనబడడం లేదని వెంటనే జంగల్ క్లియరెన్స్ చేయించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ మ్యూజియంలో పరిశీలించిన మంత్రి, పెండింగ్ నిధులు ప్రభుత్వం నుండి మంజూరు చేయిస్తామని, యుద్ధ ప్రాతిపదికన ఇంకనూ మిగిలి ఉన్న పనులను పూర్తిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి సెప్టెంబర్ 9 న జిల్లాకు రాక సందర్భంగా ప్రారంభించుటకు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పురాతన కాలం నాటి కట్టడాలను పరిరక్షించడం తో పాటు ఖిలా వరంగల్ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువచ్చి భక్తులను, పర్యాటకులను ఆకర్షిస్తూ, ప్రభుత్వ ఆదాయం పెరిగేలా అభివృద్ధి పరుస్తామన్నారు. ఖిలా వరంగల్ చుట్టుప్రక్కల ఉన్న కాకటియుల కాలం నాటి 20 గుళ్లను పునరుద్ధరణ చేసి పర్యాటకులు దైవ దర్శనం చేసుకునేలా దేవదాయ శాఖ ద్వారా అభివృద్ధి చేస్తామని, అయ్యగార్లను కూడా నియమిస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు పడావు పడకుండా ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన నిధులను రాబట్టుకొంటూ, కేంద్ర ప్రభుత్వం నుండి కూడా రావాల్సిన నిధులను సేకరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వన మహోత్సవంలో భాగంగా వరంగల్ కోటలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను కోరారు.

అనంతరం మంత్రి శంభుని దేవాలయంలో అర్చకులు మంత్రి చే ప్రత్యేక పూజలు నిర్వహింప జేశారు. ఆలయంలోని పలు సమస్యలు సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకురాగా, పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, ఓని స్వర్ణలత భాస్కర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, కుడా ప్రాజెక్ట్ అధికారి అజిత్ రెడ్డి, పురావస్తు, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్ , ఎన్పీడీసీఎల్, వైద్య ఆరోగ్య సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .



## పొలం బాటలో కలెక్టర్ దంపతులు!

మెదక్: నిత్యం సమీక్షలు.. క్షేత్ర పర్యటనలతో తీరిక లేకుండా విధులు నిర్వహించే కలెక్టర్ ఆదివారం ఆట విడుపుగా పొలం బాట పట్టారు. తన సతీమణి, ఇద్దరు కూమార్తెలతో కలిసి వరి నాట్లువేయడం విశేషం. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆయన సతీమణి శ్రీజ స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ఓ రైతు పొలంలో వరి నాట్లు వేశారు. అనంతరం కలెక్టర్ వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను పరిశీలించి, సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాల గురించి తెలుసుకుని పలు సూచనలిచ్చారు.



## పారిశుధ్య లోపంతో 19 మంది విద్యార్థులకు అస్వస్థత

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పారిశుధ్య లోపం, వంట గదుల్లో అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు తరచూ రోగాల బారిన పడుతున్నారు. వికారాబాద్ మండలం అనంతగిరిపల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం నలుగురు విద్యార్థులకు పచ్చకామెర్లు సోకడంతో చికిత్స పొందుతున్నారు. గత జులై 5న ఇదే పాఠశాలలో 45 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలైన సంఘటన తెలిసిందే. తాజాగా వికారాబాద్ మండలంలోని బూర్గుపల్లి గురుకుల పాఠశాలలో కూడా 15 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనానికి ఏర్పాట్లు




వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రోజురోజుకూ వీఐపీ భక్తుల సంఖ్య పెరగడంతో బ్రేక్ దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ఇప్పటికే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.. ఆలయ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) అధికారులతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా శ్రావణమాసం తొలిరోజు(ఆగస్టు 5) నుంచే బ్రేక్ దర్శన అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో కార్యాలయం ముందున్న ప్రస్తుత శీఘ్ర దర్శనం క్యూలైన్‌ను బ్రేక్ దర్శనానికి ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.300 టికెట్‌తో...: బ్రేక్ దర్శనం కోసం ఒక్కొక్కరికీ రూ.300 టికెట్ అమలు చేయనున్నారు. రోజూ 300 నుంచి 500 మంది వరకు బ్రేక్ దర్శనం చేసుకునే విధంగా సమయాన్ని కేటాయించనున్నారు. ఇందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. రోజూ ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శన సమయాన్ని నిర్దేశించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు దేవాదాయశాఖ కమిషనర్ ఆమోదం తెలిపారు. బ్రేక్ దర్శనం చేసుకునే ప్రతి భక్తుడికి ఒక లడ్డూ ఉచితంగా అందజేయనున్నారు. సోమవారం నుంచే దీన్ని అమలు చేయనున్నామని ఆలయ ఈఈ రాజేశ్ తెలిపారు.

## వర్గీకరణను వ్యతిరేకిస్తూ చలో కలెక్టరేట్ నేడు

ఖైరతాబాద్: ఎస్సీ వర్గీకరణకు సానుకూలత లభించడం పాలకుల కుట్ర అని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మాల సంఘాలన్నీ ఏకమై 'ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి'గా ఏర్పడుతున్నట్లు ప్రకటించారు. సమితి ఛైర్మన్ సర్వయ్య అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కో-కన్వీనర్లు జి.చెన్నయ్య, చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. తీర్పుని పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సరికాదన్నారు. తీర్పును వ్యతిరేకిస్తూ సోమవారం అన్ని జిల్లాల్లో చలో కలెక్టరేట్, సెప్టెంబరు 7 నుంచి 10 వరకు దిల్లీలో ఆందోళన నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.





## స్నేహితులతో సరదా సరదాగా సంజయ్

కరీంనగర్: అరేయ్ రంగన్నా ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావురా.. మీరంతా ఎప్పుడు వచ్చారు. ఏంది స్పెషల్.. ఇలా సరదా ముచ్చట్లు, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్. ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్‌లోని చిన్ననాటి స్నేహితులు, సరస్వతి శిశుమందిర్‌లో తనతోపాటు చదివిన క్లాస్‌మేట్స్ హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో బండి సంజయ్‌ను కలిశారు. అక్కడికి వచ్చిన స్నేహితులందరినీ ఆయన పేరుపేరున పలకరిస్తూ.. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం కేక్ కోసి ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

# మీడియా మన ప్రజాస్వామ్యానికి మూల స్థంభం

**హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ**



హరియాణా రాష్ట్రం పంచకులలో ఆగస్టు 3, 4 తేదీల్లో జరుగుతున్న ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ముగింపు సెషన్ ఆదివారం 4 ఆగష్టు 2024 రోజున హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఐజేయు జాతీయ అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మీడియా మన ప్రజాస్వామ్యానికి మూల స్థంభమని , మీడియా పటిష్టం గా ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు. ప్రభుత్వాలు వస్తూ పోతూ ఉంటాయి, పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి , కానీ దేశం శాశ్వతమని, దేశం వికాసం చెందాలంటే ప్రజాస్వామ్యం కీలకమని, అందుకు బలమైన మీడియా అవసరమని దత్తాత్రేయ అన్నారు.

ప్రభుత్వాలు చేసే మంచిని, చెడును ప్రజల ముందుకు తెచ్చే బాధ్యత మీడియాదేనని వారు స్పష్టం చేశారు. నిబద్ధతతో జర్నలిజం చేసే పాత్రికేయులను చూసి ముఖ్యమంత్రులు సైతం భయపడటం తనకు తెలుసునని, అలాంటి పాత్రికేయులను పిలిచి వారు లేవనెత్తిన సమస్యలపై మాట్లాడుకోవడం జరిగేదని దత్తాత్రేయ అన్నారు. తన దృష్టిలో పాలకులకంటే నిజం చెప్పే జర్నలిస్టే ఉన్నతమైన వారని బండారు దత్తాత్రేయ అన్నారు. సత్యం చెప్పడానికి , వాస్తవాలను వెలుగులోనికి తేవడానికి మీడియా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నో కుంభకోణాలను, అక్రమాలను, అవినీతిని వెలుగులోకి తేవడంలో పరిశోధనాత్మక జర్నలిజం ముఖ్య భూమిక పోషించిందని దత్తాత్రేయ గుర్తు చేశారు. అయితే వాస్తవాలను వెలుగులోనికి తెస్తే సహించలేని దుష్ట శక్తులు మీడియాపై దాడులు చేస్తుంటాయని దత్తాత్రేయ అన్నారు.

సత్యాన్ని వెలుగులోకి తేవాలంటే జర్నలిస్టు నిర్భీతితో, సాహసంతో, నిబద్ధతతో విధి నిర్వహణ చేయాల్సి ఉంటుందని దత్తాత్రేయ పేర్కొన్నారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చే పాత్రికేయులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలన్న ఐ.జే.యు. డిమాండు న్యాయబద్ధమేనని, ప్రత్యేక భద్రతా చట్టం డిమాండును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని శ్రీ దత్తాత్రేయ హామీ ఇచ్చారు.

భువనేశ్వర్‌లో జరిగిన ఐజేయూ ప్లీనరీకి కేంద్ర కార్మికశాఖ మంత్రి హోదాలో తాను హాజరయ్యానని, వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల గురించి తనకు అవగాహన కలిగిందని, వర్కింగ్ జర్నలిస్టుల వేజ్ బోర్డు నియమించాలన్న అంశాన్ని యూనియన్ నేతలు తన దృష్టికి తెచ్చారని, వెంటనే యూనియన్ల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసానని దత్తాత్రేయ గుర్తు చేశారు. ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని రద్దు చేయడంతో జర్నలిస్టుల వేజ్ బోర్డు కూడారద్దయ్యిందని తెలిపారు. అయితే వర్కింగ్ జర్నలిస్టులకు వేతన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు వేజ్ బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను తన స్థాయిలో కేంద్రం దృష్టికి తీసుకు వెళతానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో సాంకేతికత పెరుగుదల, కృత్రిమ మేధ ప్రవేశంతో మీడియా రంగంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. మీడియాకు విలువలు ప్రధానమని, విలువలు లేని మీడియాకు విశ్వసనీయత ఉండదని, విశ్వసనీయత లేని మీడియాకు గౌరవం ఉండదని, పాత్రికేయులు సమాచారాన్ని సమాచారంగా ఇవ్వాలని, న్యూస్ బదులు వ్యూస్ ఇవ్వడం మంచి పద్ధతి కాదని దత్తాత్రేయ అన్నారు.

ఐజేయు అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి తనకు నాలుగున్నర దశాబ్దాలుగా తెలుసునని, విలువలు కలిగిన జర్నలిస్టుగా, నిబద్ధత కలిగిన యూనియనిస్ట్ గా ఆయనంటే తనకు అపార గౌరవమని దత్తాత్రేయ పేర్కొన్నారు. సమావేశాలకు ఇరవై రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొంటున్నట్లు, అందులో రెండు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు ఎక్కువగా ఉన్నట్లు తనకు చెప్పారని , అందువల్ల తెలుగులో కూడా మాట్లాడుతానని దత్తాత్రేయ తెలిపి ఆమేరకు కాస్సేపు తెలుగులో కూడా వారు మాట్లాడారు.

అధ్యక్షత వహించిన కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన బండారు దత్తాత్రేయ రాజకియ ప్రస్తానాన్ని వారు వివరించారు. ఎంపీగా ఉన్నా, కేంద్రమంత్రిగా ఉన్నా, ఎలాంటి భేషజాలు లేకుండా సామాన్య ప్రజలతో కలిసిమెలిసిపోయే నేతగా, ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధిగా, దత్తాత్రేయ ప్రజల మన్ననలు పొందారని, అన్ని రాజకీయ పార్టీలవారూ వారిని అభిమానిస్తారని వివరించారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు శ్రీ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే "ఆలయ్ బలయ్" కార్యక్రమం పొందుతున్న ప్రాచుర్యాన్ని వివరించారు. ఉత్తర తెలంగాణా జిల్లాల్లో అటల్ బీహారీ వాజపేయి పాల్గొన్న సభల నిర్వాహకునిగా దత్తాత్రేయ, వార్తా సేకరణకు తానూ కొన్ని రోజులపాటు చేసిన పర్యటనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్. సిన్హా మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని రద్దు చేయడంతో ఏర్పడిన పరిస్థితులను దత్తాత్రేయ దృష్టికి తెచ్చారు. ఐజేయు సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ , చండీఘర్ హర్యానా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రామ్ సింగ్ బ్రార్, చైర్మన్ బల్వంత్ తక్షీ, చండీ ఘర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నళినీ ఆచార్య, ఐజేయూ జాతీయ కార్యదర్శి శ్రీ బల్బీర్ సింగ్ ఝూండు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ ని ఐజేయు నాయకులు ఘనంగా సత్కరించడం జరిగింది.